# ప్రాచ్యారామం

[ఒకనాడు తెనుగు మాగాణిలో క్షీరారామం, దక్షారామం, భీమారామం, కుమారారామం, ప్రాచ్యారామం మొదలైన ఆరామాలు అత్యంత ప్రసిద్ధాలై వుండినవి. కాని నేడవి రూపరివున్నాయి. ఐనా రసార్ద్రహృదయులు, కవితాత్మగల ఆంధ్రమహాశయులు కొందరు నేటికిగూడ దానిని దర్శించి తన్మయులవుతూనే వున్నారు. ఇపుడు ఆ ఆరామాలు రూపరివుండమే కాకుండా కొన్ని నామాంతరాలిని కూడా పొందివున్నాయి. నాటిప్రాచ్యారామం నేడు గునుపూడి. పౌరాతన్యమే చుకొన్న ఈగునుపూడిని చూచినప్పుడు తనకవి తాత్మలో పొడసూపిన రసమయభావాల్ని వ్యాసకర్త ఇందు పాఠకులకు నివేదిస్తున్నాడు. —సంపాదకుడు.]

రచయిత :

## కవికొండల వెంకటరావు, బి.ఎల్.

"పాలకొల్లు"లో బస్సెక్కి 'గూడెం' ముఖంగా వెడుతూవుంటే యనమదుర్రు మురుగు కాలవ దాటకుండానే ప్రయాణీకులకు ఎడంతట్టు భీమావరం రైలుస్టేషన్, ఆ పైని గునుపూడి గుడీ కనిపిస్తాయి. రోడ్డుమీందదిగి ఎదో అడ్డదారి చూచుకు వెళ్ళిపోవాలి వెంటనే గునుపూడిగుడి చూడ్డానికి. రైలుస్టేషన్ కేసి దిక్కులు చూడకూడదు. రైలుస్టేషన్ కేసి చూచేడా అటు గుడివాడో యిటు నిడదవోలో వెళ్ళిపో బుద్ధేస్తుంది. ఈరోజుల్లో రైలుప్రయాణాలంటే అంతచేటు మనస్సుని లాగివేస్తూవున్నాయి. కాబట్టి కట్టురాటను బంధించినట్టు మనస్సును లాగబట్టి గుడి కేసే తిలకించాలి!

అదుగో ప్రాచ్యారామ సోమేశ్వరుడు! అదిగో! అగ్నిగుండం! ఆమెయే అన్నపూర్ణ!—

గుడిని సమీపిస్తూవుంటే ఏమిటీధ్వని? ఏమి.టీవేషం? గునుపూడి జంగందేవర! దేవుణ్ణో మనిషినీ విడదీసి కనలేని తావు నాకదొక్కటే కనిపించింది. జంగందేవరా! ఏమిటి చేస్తున్నావు?

"గణగణగంట వాయిస్తున్నాన్
శంభో! మహాదేవ! శంభో!
హరహర! మహాదేవ! శంభో!
శంభో! శంకర! మహాదేవ!"

. . . . . . . . . . . . . . . . . . . . . . . .

ఉదయం ఏడెనిమిది ఘళ్ళ పొద్దెక్కింది. ఆరుబయట గుడి. గుడికి దగ్గరసా ఇళ్ళులేవు. వాకిళ్ళులేవు. నిర్మానుష్యమే అని చెప్పొచ్చు. కాని నినదం? నినదంలో నీరవం? నీరవంలో నీటిమధ్యనే లేచి కనవచ్చు గునుపూడి జంగందేవర? గొప్ప కనుకట్టుదృశ్యం! చెప్పన్న దేశాల సరికట్టు ననశ్వరావేశం! శంభో! శంకర! మహాదేవ! శంభో!—

జంగందేవర వేషం చాలామంది చూచేవుంటారు. విశ్వవిద్యాలయస్నాతకుని వేషంలా పెద్దగౌను-గౌనుమీద ఇటు అటు తూగేడు వుత్తరీయాలు రెండో మూడో— జోలి- నెత్తిమీద శశిమౌళిని సూచించే గుడ్డ కిరీటం- చంకను మహాశంఖం, వెదురువ్రాదు—ఈచేత పొడుగాటి వలంపాటికర్ర నిలువెత్తునా నేలను ఆన్చి దానిపైని శరీరం వాల్చివాల్చకుండా నిలిచి, ఆచేత పెద్దగంట వాయిస్తూ కనవచ్చేడు. 'శంభో, మహాదేవశంభో' అనే పిలుపు ఘంటానాదంతో మేళవిస్తూ వినవచ్చేడు.

. . . . . . . . . . . . . . . . . . . . . . . .

గుడి, గుడిమతలపు, గుడిమహిమ నిజంగా తెలుసుకోవాలీ అంటే మనం ఆజంగందేవరనుకూడా తీసికుని గుడి ప్రవేశించకూడదు. గుడితొలీగుమ్మంవద్దనే అతగాణ్ణి ఆగ

మని అతగాని కో కాసీయిచ్చి వెళ్లిపొమ్మని, వొంటరిగా తన్మయభావంతో గుడి ప్రవేశించాలి—

సోమేశ్వరస్వరూపం గజంఎత్తు పాలరాయిలింగం : అందుమీద రేకుమందిరం. మందిరంముందు దీపం. ప్రాంగణంలోని ధ్వజస్తంభం క్రొత్తగా 1907 లో ఎత్తినట్లు చెప్పబడ్డది. చిన్ననంది, పార్వతీ విగ్రహం, వినాయకవిగ్రహం, అపురూపాలుగా చూస్తాం కాస్సేపు. ఎండ క్రమేపి ఎక్కువౌతుంది. ఇంటికి వెళ్ళిపోవాలి అనుకుంటూ వుంటాం !

అంతలో వొకచోట నిలబడి చూడ్డంలో మెట్లగపించినాయి. ఎందు కామెట్లు అని అనుకొన్నాం. మెట్లమ్మటే ఎక్కి దేవాలయోపరి నిలబడ్డాం. అక్కడో చిన్నగుడి ఆచిన్న గుడి తలుపులు మూసివున్నాయి. తెరవగూడదా అంటూ తోస్తే ఇట్టే విడివడ్డాయి తలుపులు ; చిన్నగుడిలోకి పెద్దగా వెలుతురు చొఱబడింది నా కంటెముందు. మేమూ చొఱబడ్డాం వెంటవెంటనే లోని వెల్తుర్ని చీకటిపరుస్తూ, క్రొత్తవెలుతుర్ని మా వెనకాతల్నే రమ్మనమంటూ.

ఈ వెలుగు చీకటి దోసందులో తొలకాడింది అన్నపూర్ణాదేవివిగ్రహం ! వేలకొలదిగా జంగాలు "శంభో, మహాదేవశంభో" అని అంటూ వేలకొలదిగా ఘంటలు మ్రోగిస్తూ నిత్యం వుత్సవం సాగిస్తూ వుంటే వాళ్ళందఱకూ నిరతాన్నప్రదాయినియై విరాజిల్లిన మహేశ్వరాలిగా తోచింది. కాని ఆనిమేసమందు పరిక్రమించి చుట్టూ చూచేసరికి

జంగ మొక్కడు లేడు
జంతు వొక్కటి లేదు
జానపదు డైనాను నడవడం లేదు
జలజాత మైనాను విడవడం లేదు.

వుత్త రాతిచెక్కడం. వొంటరిగా వున్న విగ్రహం. సాలిగూండ్లు మాత్రమే ఆవిగ్రహంయొక్క మానాన్ని కాపాడుతూ వున్నాయి. విగ్రహంయొక్క ముఖంకేసి తొంగ్తి చూచి ఆముగద చెక్కడంలోని గభీరభావానికి ముగ్ధుణ్ణయి నఖశిఖపర్యంతం తేరిపారిచూచాను. అంతా దివ్యప్రభ ! దివ్యప్రభ!

ఆయమను అర్చిస్తూ ముక్తి బొందడమనేదే వొక కళగా అలవరుచుకోవాలని బుద్ధిపుట్టింది. సాలిగూండ్లు ఊడ్చి పూలుకప్పితేనో ? పూలుమార్చి చేతులుకప్పితేనో ? చేతులుతీసి భావాంబరమే కట్టబెడితే ? ఈలా ఈలా ఊహజ్యోతి ప్రజ్వరిల్లింది. అదే నేనియ్యగల మంగళహారతి అని అనిపించింది.

# ప్రస్తావిక పద్యాలు

## నెమలి

తనదు పింఛము శిరమున దాల్చినాడు
భువనమోహనాంగుడు తలపూవు గాగ,
అనుచు బురివిప్పి మురిసి నాట్యంబు సేయు
నీ మయూరవిలాసము నిచట చూడు !

*

## పువ్వులు

జన్మమెత్తెను నిస్వార్థ జాతియందు,
నవ్వులాటయే తమ జీవనవ్రతంబు,
త్రుంచు వారల మనసు రజించు మతము,
విరుల కేనాటికైనను విలువగలదె !

*

—చిర్రావూరి కామేశ్వరావు, బి.ఎల్.